www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 25 మార్చి 2025



పలు పరిశ్రమలకు నోటీసులు

ప్రజాశక్తి - కాకినాడ

నీటి వినియోగ ఛార్జీలు చెల్లించాలని పలు పరిశ్రమలకు సోమవారం నోటీసులు జారీ చేసినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లోని నాగార్జున ఫెర్టిలైజర్స్, కాకినాడ సీ పోర్ట్, జిఎంఆర్ ఎనర్జీ లిమిటెడ్, ఎంవి శేఖర్ అండ్ కో, అశోక ఎంటర్‌ప్రైజెస్, అంజని ఏజెన్సీస్, అన్నపూర్ణ మెరైన్స్ నుంచి బకాయిలు రావాల్సివుందన్నారు. ఆయా కంపెనీలు 2019 నుంచి నేటి వరకు సుమారు రూ.87,21,91,000 బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. దీనిపై ఇప్పటికే మార్చి 7న నోటీసులు జారీ చేసినా ఎటువంటి స్పందన లేదన్నారు. అందుకే మరోసారి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. 15 రోజుల్లోగా స్పందించక పోయినట్లయితే కఠినమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అంగన్‌వాడీలకు తప్పని అవస్థలు

- మొరపెడుతున్నా పట్టించుకోని పాలకులు
- ఏళ్ల తరబడి నిలిచిన టిఎ, డిఎ బకాయిలు
- ఈవెంట్ బిల్లులకు కలగని మోక్షం
- ఫేస్ యాప్‌తో అష్టకష్టాలు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సిబ్బందికి కష్టతరంగా మారింది. గత ఆరేళ్లుగా టిఎ, డిఎ బకాయిలు, ఏడాది కాలంగా పిల్లలకు అన్నప్రాసన, గర్భిణీలకు సీమంతాల ఈవెంట్ బిల్లులు నిలిచిపోయాయి. మరోవైపు ఇస్తున్న అరకొర వేతనాలు సమయానికి అందని పరిస్థితి ఏర్పడింది. దీంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే దుస్థితి నెలకొంది. ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదంటూ అంగన్‌వాడీలు ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 5,546 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో సుమారు 5 వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 4,818 ఆయాలు పని చేస్తున్నారు.

టిఎ, డిఎ బకాయిలు ఎంతంటే..?

ప్రాజెక్ట్, సెక్టార్ల సమావేశాలు ప్రతినెలా రెండుసార్లు జరుగుతున్నాయి. సొంత సొమ్ములు ఖర్చు చేస్తున్నారు. పలు అంగన్‌వాడీలు అప్పులు చేసి సమావేశాలకు వెళుతున్నారు. నెలకు రెండు టిఎ, డిఎలు ఇవ్వాల్సి ఉంది. ఒక్కో డిఎ రూ.300 ఇవ్వాల్సి ఉన్నా ప్రభుత్వం ఆరేళ్లుగా పెండింగ్లో ఉంచింది. 2017 నుంచి టిఎ, డిఎ బిల్లులు ఇవ్వడం లేదు. నెలకు ఒక్కొక్కరికి సుమారు రూ.600 ఇవ్వాల్సి ఉంది. ఇలా ఏడాదికి ఒక్కొక్కరికి రూ.7,200 ఉండగా ఆరేళ్లకు సుమారు రూ.43 వేలు బకాయిలు పెండింగులో ఉంది. దీనిపై పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా ప్రభుత్వం వద్ద బడ్జెట్ లేదని అధికారులు చెప్పుకొస్తున్నారని వర్కర్లు ఆవేదన చెందుతున్నారు. అయితే వీటిని ఇవ్వకుండా ఎగవేత ధోరణితో ప్రభుత్వం వ్యవహరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలు సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీలు సమ్మె చేయగా 2023 డిసెంబర్ 20న టిఎ, డిఎ బిల్లుల విడుదల చేస్తామని జీవో ఇచ్చారు. 14 నెలలు దాటినా జీవోను అమలు చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పైగా జీవో విడుదలయినప్పటి నుంచి మాత్రమే బిల్లులు ఇస్తామని, అంతకంటే ముందు కాలానికి ఇచ్చే విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

ఈవెంట్ బిల్లులు అందేనా..?

ప్రతి నెలా పిల్లలకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం ఈవెంట్లు బిల్లులు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉండగా ఇటీవల ఏడాది కాలానికి విడుదల చేశారు. ప్రతి నెలా ఒక్కొక్కరికి రూ.500 ఇవ్వాల్సి ఉంది. సొంత ఖర్చులతో అంగన్‌వాడీ సిబ్బంది ఈ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు విడుదల కాని పరిస్థితుల్లో అప్పులు చేసి ఈవెంట్స్ నిర్వహిస్తున్నామని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫేస్ యాప్‌తో అష్టకష్టాలు

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలంటే ప్రభుత్వం ఫేస్ యాప్‌ను తప్పనిసరి చేసింది. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తప్పనిసరిగా వాళ్ల ఫొటోలను తీసి యాప్‌లో పొందుపరచాలి. దీంతో అంగన్‌వాడీలు ఇప్పటికే గర్భిణీలు, బాలింతలకు ఫేస్ యాప్ ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. కొంతకాలంగా 6 నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు సైతం ప్రతీ నెల ఫేస్ యాప్ ద్వారా అందించాలని అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు నాసిరకం కావడంతో తరచూ సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. అలాగే ఇంటర్నెట్ సౌకర్యం లేని ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫేస్ యాప్‌లో నమోదు చేసేందుకు లబ్ధిదారులు ఓటిపి చెప్పాల్సి ఉంటుంది. వివిధ సాంకేతిక సమస్యల వలన ఓటిపిలు సమయానికి రాకపోవడంతో వారికి పౌష్టికాహారం అందించలేని పరిస్థితి ఏర్పడుతుంది. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించకుండా తమపై ఒత్తిడి తీసుకురావడం సరికాదు అంటూ ఆవేదన వెలిబుచ్చుతున్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



అంగన్‌వాడీ వ్యవస్థపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఏళ్ల తరబడి టిఎ, డిఎ బిల్లులు విడుదల చేయకపోవడం బాధాకరం. అలాగే ఈవెంట్ బిల్లులు ఎప్పటికప్పుడు ఇవ్వాల్సి ఉన్నా విడుదల చేయడం లేదు. అంగన్‌వాడీలు అప్పులు చేసి ఎంతకాలం పెట్టుబడులు పెడతారు. తక్షణం ప్రభుత్వం స్పందించి పెండింగ్లో ఉన్న బిల్లులు విడుదల చేయాలి లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం.

జి. బేబీరాణి, అధ్యక్షురాలు
ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

బకాయిలతో బతికేదెలా..?



ప్రభుత్వం న్యాయంగా తమకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిల విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది. అలాగే వేతనాలు కూడా సకాలంలో అందడం లేదు. ఒక్కొక్కసారి రెండు నుంచి మూడు నెలలు పెండింగ్‌లో ఉంచుతున్నారు. కనీస వేతనాలు అమలు కావడం లేదు. సమయానికి ఇవ్వకపోతే ఎలా బ్రతకాలి. అప్పులు చేసుకుని కుటుంబాలను ఎంత కాలం పోషించుకోవాలి. వెంటనే ప్రభుత్వం స్పందించి బకాయిలివ్వాలి.

ఇ.చంద్రావతి, కార్యదర్శి, కాకినాడ జిల్లా
ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్

స్మార్ట్ మీటర్లతో మా పొట్ట కొట్టొద్దు

ప్రజాశక్తి - కాకినాడ

స్మార్ట్ మీటర్లతో తమ పొట్టలు కొట్టొద్దని ఎపి విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.వీరబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన 20 ఏళ్లుగా ఇంటింటికీ వెళ్లి విద్యుత్ బిల్లులను తీసుకుంటూ కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నామని అన్నారు. విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలవారీ వేతనాలు అమలు చేయాలని, స్మార్ట్ మీటర్స్‌తో తమను తొలగించే చర్యలను ఉపసంహరించే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. మీటర్ రీడర్స్ చేసిన ఆందోళన కారణంగా సంబంధిత అధికారులు చర్చలు జరిపి నాలుగు అంశాలను అమలు చేయడానికి హామీ ఇచ్చారని చెప్పారు. స్మార్ట్ మీటర్లు వస్తే మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని చెప్పారన్నారు. మీటర్ రీడర్లకు ఎస్క్రో అకౌంట్ ద్వారా ప్రతినెల వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. సిఎండిలు, ఎస్క్రో అకౌంట్లు అమలు చేయాలని ఆదేశించినప్పటికీ కిందిస్థాయి అధికారులు అమలు పరచటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు కంపెనీల పరిధిలో ఒకే పని దినాలు అమలు చేయాలని హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయడం లేదన్నారు. 2019 తర్వాత మీటర్ రీడర్స్‌కు ఒక్క పైసా కూడా వేతనం పెరగలేదన్నారు. పెంచేందుకు పరిశీలించి త్వరగా అమలు చేస్తామని హామీ ఇచ్చారని, అది కూడా అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి పెద్దాపురం, జగ్గంపేట, పిఠాపురం, కాకినాడ డివిజన్లకు చెందిన అసోసియేషన్ ప్రతినిధులు జి.రామకృష్ణ, పి.నానాజీ, జి.మాధవ, రాహుల్ నాయకత్వం వహించారు.

పబ్లిక్ టాయిలెట్స్ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కాకినాడ

నాన్ స్టాప్ బస్టాండ్ వద్ద మహిళలకు పబ్లిక్ టాయిలెట్స్ సౌకర్యం కల్పించాలని శ్రామిక మహిళ కన్వీనింగ్ కమిటి కోరింది. సోమవారం నగరపాలక సంస్థలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా జిల్లా కో కన్వీనర్ చంద్రమళ్ళ పద్మ మాట్లాడుతూ నాన్ స్టాప్ బస్టాండ్ వద్ద అనేకమంది మహిళా ప్రయాణికులు, విద్యార్థినులు పబ్లిక్ టాయిలెట్స్ లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సెప్టెంబర్ నెలలో ఈ సమస్యపై కమిషనర్‌కి వినతిపత్రం పిచ్చి విజ్ఞప్తి చేశామని,దానిపై వెంటనే స్పందించి అక్కడ కొంత పని చేయడం జరిగిందన్నారు. కానీ ఇంకా అక్కడ పూర్తిగా వాటర్ సౌకర్యం కల్పించి పరిశుభ్రత కొరకు ఒక వర్కర్‌ను నియమించాలన్నారు. మహిళల పరిస్థితిని అర్థం చేసుకొని వెంటనే పబ్లిక్ టాయిలెట్స్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - కాజులూరు

అక్రమంగా ఇంజన్లతో సాగునీటిని మళ్ళిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని శలపాక, గొల్లపాలెం, ఆర్యవటం, తుమ్మలపల్లి లంక గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి ఎ.అశోక్, ఇరిగేషన్ ఎఇ ప్రవీణలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 26 గ్రామాల పరిధిలో శివారు ప్రాంతాలకు నీటి ఎద్దడి లేకుండా చూస్తామన్నారు. ప్రస్తుతం పంతులు వారి విధానంతో సాగునీటి పంపిణీ జరుగుతుందని, ఎక్కడైనా కొబ్బరి తోటలకు, ఆక్వా చెరువులకు సాగునీటిని ఇంజన్ల సాయంతో తోడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వేఘేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


శివారు ప్రాంత పొలాలను పరిశీలిస్తున్న తహశీల్దార్

మంచినీరు, మజ్జిగ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కాకినాడ

వేసవిని దృష్టిలో పెట్టుకుని పని ప్రదేశాల్లో మంచి నీరు, మజ్జిగ సౌకర్యం కల్పించాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. సోమవారం కార్మిక శాఖ కార్యాలయంలో లేబర్ అధికారులు కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ కార్మికులు పనిచేసే చోట మంచినీరు, మజ్జిగ, ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ కూలీలకు టెంట్లు వేయాలన్నారు. ఫ్యాక్టరీ కార్మికుల పని గంటలు ఎండ ఎక్కువగా ఉండే సమయంలో పని చేయించకుండా విశ్రాంతి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వేడి అధికంగా ఉండే బాయిలర్స్‌ను తనిఖీలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు తోకల ప్రసాద్, పిఎస్.నారాయణ, టిఎన్‌టియుసి నాయకులు గదుల సాయిబాబా, ఐఎన్‌టియుసి నాయకులు తాళ్లూరి రాజు పాల్గొన్నారు.


కార్మిక శాఖ అధికారులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

టిబి నిర్మూలనకు ఐక్యంగా కృషి

ప్రపంచ టిబి దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. టిబి నిర్మూలనకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉన్నతాధికారులు పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ టిబి దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ జడ్‌పి జంక్షన్ మీదుగా జ్యోతిబాపూలే విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిబిని అంతం చేయగలం అన్న నినాదంతో ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టిబి వ్యాధిపై అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నమని చెప్పారు. జిల్లాలో టిబి వ్యాధి నిర్మూలకు వివిధ చర్యలను చేపట్టామన్నారు. క్షయ అన్నది అంటువ్యాధి అని, అనుమానిత లక్షణాలు ఉన్నవారు వెంటనే ఖల్లె పరీక్ష చేసుకుని వ్యాధిని నిర్ధారించుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ మాట్లాడుతూ టిబి రోగులు వ్యాధి నుంచి వేగంగా బయటపడాలంటే వ్యక్తిగత కృషితో పాటు, సామాజికంగా నైతిక సహకారం కూడా అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో టివి కంట్రోల్ అధికారి డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్ ప్రభాకర్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, వివిధ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ సౌజన్యం ఆధ్వర్యంలో నాగులపల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ సరోజినీ, హెచ్‌ఇ.గౌరీశ్వరి, హెచ్ఎస్.అప్పారావు, హెచ్‌యు జ్యోతిరత్నకుమారి, ఎంపిహెచ్ఎ గంగాధర శ్రీనివాస్, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



కాకినాడలో నిర్వహించిన ర్యాలీలో జెసి, డిఎంహెచ్‌ఒ, తదితరులు

గొల్లప్రోలు స్థానిక పిహెచ్‌సి వద్ద అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ అమృతరావు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సునీత మెర్సీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్, ఆసుపత్రి పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన 'టిబి వ్యాధిని తరిమికొడదాం' అని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య, రమాదేవి, ఎన్‌వి.రమణ, వైఆర్‌సి. రావు, టి.గంగాభవాని, శ్రీనివాసరావు, మహాలక్ష్మి, రోజీ, వసంత, రాజు పాల్గొన్నారు. **శంఖవరం** స్థానిక పిహెచ్‌సి వద్ద వైద్యులు శ్రీరామ్ రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దంత వైద్యులు సిహెచ్‌ఒ మేరీమణి, టిబి యూనిట్ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్య అధికారి డాక్టర్ బి.జయరామ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో స్టాఫ్ నర్సులు, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికవర్‌లో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ


డాక్టర్ భీమశంకర్

స్థానిక మెడికవర్ ఆసుపత్రిలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పల్మానాలజిస్ట్ డాక్టర్ భీమశంకర్ మాట్లాడుతూ మైకో బాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బాక్టీరియ వల్ల క్షయవ్యాధి పురాతన కాలం నుంచి ప్రపంచాన్ని పీడిస్తుందన్నారు. క్షయ ఊపిరితిత్తులను ప్రభావితం చేయడమే కాకుండా మూత్రపిండాలు, మెదడు, వెన్నెముక వంటి ఇతర అవయవాలను ప్రభావితం చేస్తుందన్నారు. దగ్గు, తుమ్ములు, ఉమ్మివేయడం వంటివి చేసినపుడు గాలి ద్వారా క్షయ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. ప్రతీ ఏడాది మార్చి 24వ తేదీన ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్షయవ్యాధికి సరైన సమయంలో వైద్య చికిత్స అందిస్తే నయం చేయడమే కాకుండా పూర్తిగా నివారించవచ్చన్నారు.

వైసిపి పాలనలో రూ.50 కోట్ల అవినీతి : వర్మ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి


పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో వైసిపి పాలనలో సేకరించిన 300 ఎకరాలకు సంబంధించి రూ.50 కోట్ల వరకూ అవినీతి జరిగిందని మాజీ ఎంఎల్‌ఎ, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్.వర్మ ఆరోపించారు. సోమవారం ఆయన ఉప్పాడ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 300 ఎకరాల్లో మట్టిని నింపుతున్న పేరుతో చెరువుల్లో మట్టిని తొవ్వుకుని అక్రమంగా అమ్ముకున్నారని విమర్శంచారు. మత్స్యకారుల కోసం ఎస్ఇజడ్‌లో సిఎం చంద్రబాబు 100 ఎకరాల భూమిని డి నోటిఫికేషన్ చేయాలని నాడు కేంద్రానికి లేఖ రాయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సమయంలో పవన్ కళ్యాణ్, టిడిపి సభలో మత్స్యకారులకు ఇచ్చిన హామీ మేరకు ఉప్పాడ, అమీనాబాద్, మూలపేట మత్స్యకారులకు ఇల్లా స్థలం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, మాజీ జడ్‌పిటిసి బత్తుల రాజేష్, రాయుడు శ్రీరాములు, కోర్సు సర్పంచ్ రొంగల వీరబాబు, మాజీ ఎంపిటిసి సభ్యులు సన్నిబాబు పాల్గొన్నారు

పి4 సర్వేను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

అట్టడుగు పేద కుటుంబాల వారి ఆర్థిక అభివృద్ధి కోసం చేపట్టిన పి- 4 సర్వే ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి అన్నారు. సోమవారం స్థానిక అంకయ్యపేటలోని 10, 11 సచివాలయాలకు సంబంధించి జరిగిన పి - 4 సర్వే వార్డుల సభకు ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మున్సిపల్ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు మాట్లాడుతూ సమాజంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పి - 4 సర్వేను చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, వార్డు కౌన్సిలర్లు ఒబిలిశెట్టి నూక రత్నం, కట్టా రాజబాబు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడ్డం పెద్దకాపు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అలాగే సామర్లకోటలోని 9 వార్డు సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, సచివాలయం సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వినతులను సకాలంలో పరిష్కరించాలి

జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమాల్లో అధికారులు అర్జీలను స్వీకరించారు. ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడలో..పిజిఆర్ఎస్‌లో వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన వినతిపత్రాలను స్వీకరించారు. మొత్తం 482 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిఆయన మాట్లాడుతూ వినతులను నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుని సమస్యకు తగిన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెసి రాహుల్ మీనా, డిఆర్‌ఒ జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్‌విపి.సత్యనారాయణ, కెఎస్ఇజెడ్ ఎస్‌డిసి కెవి.రామలక్ష్మి, సిపిఒ పి.త్రినాథ్, బిసి కార్పొరేషన్ ఇడి ఎ.శ్రీనివాసరావు, కలెక్టరేట్‌కు చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ప్రత్తిపాడు జడ్‌పి హైస్కూల్లో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ బృందం జెసికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం నుంచి స్కూలుకి ఎటువంటి ప్రహరీ లేకపోవడంతో అపరిచితుల రాకపోకలు సాగుతున్నాయని, దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు మణికంఠ, ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో..స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 10 అర్జీలు వచ్చాయని ఆర్‌డిఒ శ్రీరమణి తెలిపారు. భూ సమస్య పరిష్కారం కోరుతూ 4, విద్యుత్ సమస్యలపై 2, ఎఫ్ఎంసిపై 2, ఆర్‌టిఐపై 2 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఆయా ఫిర్యాదుల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసినట్లు ఆర్‌డిఒ తెలిపారు.

పిఠాపురంలో..పాడా కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్‌లో 90 అర్జీలు వచ్చినట్లు పాడా పీడీ చైత్రవర్షిణి తెలిపారు. రెవెన్యూ -31, మున్సిపాలిటీ- 20, అగ్రికల్చర్ - 05, పింఛనులు- 11, ఇతర సమస్యలకు సంబంధించి 23 అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఎఫ్‌కె పాలెం-విరవాడ గ్రామాల మధ్యలో ఉన్న పాపిడి దొడ్డి చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని కాకినాడలో జరిగిన పిజిఆర్ఎస్‌లో ఎఫ్‌కె పాలెం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అలాగే సిపిఎం ప్రజాచైతన్య యాత్రలో గుర్తించిన సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు పిజిఆర్ఎస్‌లో పాడా పీడీ చైత్రవర్షిణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ కె.చిన్న, నాయకులు కోనేటి రాజు, విశ్వనాధం మణి, నాగు, జి.అప్పారావు, ఎస్.రాజేష్, రాజ్యలక్ష్మి, అరుణ్‌కుమారి పాల్గొన్నారు.


పిఠాపురంలో పాడా పీడీకి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు


జెసికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పలువురిని పరామర్శించిన గిరిబాబు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ ముద్రగడి గిరిబాబు సోమవారం పరామర్శించారు. మండలంలోని పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన దలే ధనబాబు తల్లి సరస్వతి ఇటీవల మృతి చెందారు. అలాగే వేములపాలెం గ్రామానికి చెందిన పిల్లి రమణ కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆయన ఆయా కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామిశెట్టి నాని, గుడాల వెంకటరత్నం, శేరు కృష్ణ, చందక నాని పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర రథ సారథులు విద్యార్థులే...

ప్రజాశక్తి - కిర్లంపూడి

స్వచ్ఛ ఆంధ్ర రథసారధులు విద్యార్థులేనని సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. సోమవారం మండలంలోని బూరుగుపూడి ప్రభుత్వ పాఠశాలలో తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతగా విద్యార్థులు భావించాలన్నారు. మన ఇంటి శుభ్రతతో పాటు మన పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతి విద్యార్థి తమ కుటుంబ సభ్యులను చైతన్యపరిచాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరుగా పంచాయతీ సిబ్బందికి అందజేసి సహకరించాలని అన్నారు. స్వచ్ఛ పరిసరాల కోసం కృషి చేసే విద్యార్థులను గుర్తించి వారికి బహుమతులు అందజేస్తామని అన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రైల్వే స్టేషన్ పరిధిలోని బిక్కవోలు - అనపర్తి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలునుంచి జారిపడి దుర్మరణం చెందాడు. మృతుడు వయస్సు సుమారు 50 నుంచి 55 వరకూ ఉంటుందని,ఆలీవ్ గ్రీన్ ఫ్యాంట్, తెలుపు, కాఫీరంగు డిజైన్ కలిగిన చొక్కా, రెయిన్ కోటు ధరించి ఉన్నాడని రైల్వే ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కీమెన్ వి.కొండబాబు ఇచ్చిన సమాచారంపై మృతదేహానికి పంచనామా నిర్వహించి కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు ధర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని అన్నవరప్పాడు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిట్ల వేమవరం గ్రామానికి చెందిన మాకా సురేష్(31), నేతల హనుమంతు(26) మృతి చెందారు. అన్నవరప్పాడు పనికి వెళ్లి తిరిగి వారి గ్రామానికి బైకుపై వెళ్తుండగా అన్నవరప్పాడు సెంటర్‌కు వచ్చేసరికి రావులపాలెం వైపు నుంచి తణుకు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మాకా సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన హనుమంతును ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. వీరి మృతితో ఇరు కుటుంబాల్లో విషాదం అలముకుంది. మృతుడు సురేష్ తండ్రి మాకా వెంకటేశులు ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

సారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని 17 గ్రామాల లంకల పరీవాహక ప్రాంతాలలో ఎక్సైజ్ ఎస్ఐ అన్నవరం తన సిబ్బందితో సోమవారం విస్తతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెలిచేరు శివారు లంకల ఇసుక తిన్నెల్లో నాటు సారా తయారు చేయడానికి నిలువ ఉంచిన 6 వందల లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి నాటు సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - అంబాజీపేట

పుల్లేటికుర్రు పరిధి చినలంకలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. ప్రధాన రోడ్డుపై మతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా అంబాజీపేట ఎస్ఐ కె.చిరంజీవి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ప్రమాదం తెల్లవారు జామున జరిగి ఉంటుందన్నారు. మహిళ వయసు 35 ఏళ్లు ఉంటుందని, నాలుగు రోజుల నుంచి ఆమె అంబాజీపేట పరిధిలోని పరిసర ప్రాంతాలలో సంసరిస్తోందని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని అమలాపురం ఆసుపత్రికి తరలించమని ఎస్ఐ తెలిపారు.

బెల్ట్ షాపులను నివారించాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

గ్రామాల్లోని బెల్టు షాపులను నివారించాలని జై భీమ్‌రావు భారత్ పార్టీ ఉపాధ్యక్షుడు దాడిశెట్టి వీరబాబు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, దేవాలయాలు జాతీయ రహదారులు సమీపంలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా పుట్టుకొచ్చాయన్నారు. ఇప్పటికే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అధికారులు బెల్ట్‌షాపుల నిర్వాహణపై ప్రత్యేక దృష్టి సారించి నిర్మూలించాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - కిర్లంపూడి

అసాంఘిక కార్యకలాపాలు పాల్పడే వారిపై డ్రోన్ సహాయంతో చర్యలు తప్పవని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం కీర్లంపూడిలో అనుమానిత ప్రాంతాలను డ్రోన్ సహాయంతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్న చోట నుంచి సుమారు 6 నుంచి 7 కిలో మీటర్స్ ఏరియాలో కోడిపందాలు, గుండాట, పేకాట, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి వాటిని డ్రోన్ల సాయంతో గుర్తించగల్గుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి.సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

ప్రపంచ క్షయ నివారణా దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి డిడి టి.రవిశంకర్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.అలాగే నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా నర్సింగ్ కళాశాల ఉపాధ్యాయులు బాపిరాజు, సత్యశ్రీ, యువజన అధికారి తిర్రి గోపి పాల్గొన్నారు. అలాగే జిప్మెర్‌లో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి ఆనంద్రాజ్ మాట్లాడారు.



పురస్కారాన్ని అందుకుంటున్న అశోక్‌కుమార్

పొనుగుమట్లకు కవితా పురస్కారం

ప్రజాశక్తి - యానాం

ప్రపంచ కవితా దినోత్సవం పురస్కరించుకుని కవిసంధ్య, చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కవితల పోటీల్లో యానాంకు చెందిన కవి పొనుగుమట్ల అశోక్‌కుమార్ రచించిన కవితకు ప్రోత్సాహక బహుమతి లభించింది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం సెమినార్ హాల్లో జరిగిన కార్యక్రమంలో పొనుగుమట్లను సాహితీవేత్తలు డాక్టర్ ఎన్.గోపి, దర్భశయనం శ్రీనివాసాచార్య, డాక్టర్ కొప్పర్తి వెంకటరమణమూర్తి, సుధామ, కవిసంధ్య అధ్యక్షుడు డాక్టర్ శిఖామణి సత్కరించి ప్రశంసాపత్రం, మెమోంటో అందజేశారు.

పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 25, 26, 27 తేదీల్లో ఎపిపిఎస్‌సి ద్వారా నిర్వహించే కంప్యూటర్ బేసిడ్ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని డిఆర్ఒ జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎపిపిఎస్‌సి, రెవెన్యూ, ప్రజా రవాణా, పోలీస్, వైద్య ఆరోగ్యం, విద్యుత్ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్‌టిఆర్ యూనివర్సిటీ హెల్త్ సైన్స్ అసిస్టెంట్ లైబ్రేరియన్, ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్, అనలిస్ట్ గ్రేడ్-2, ఎపి ఎడ్యుకేషనల్ సర్వీస్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగుల భర్తీకి సంబంధించి జిల్లాలో నిర్వహించే కంప్యూటర్ బేసిక్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పరీక్షలకు నిర్వహణకు నగరంలోని ఎస్.అచ్చుతాపురం వద్దనున్న ఆయాన్ డిజిటల్ టెక్నాలజీ, కాకినాడ రూరల్ లోని సాఫ్ట్ టెక్నాలజీ, సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు అవసరమైన తాగునీరు ఇతర సదుపాయాలు కల్పించేందుకు ఆయా పరీక్ష కేంద్రాల ప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎపిపిఎస్‌సి సెక్షన్ అధికారి ప్రశాంత్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు



ఆక్రమిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అఖిలపక్షం

రక్షిత మంచినీటి చెరువు గట్టు తొలగించి ఆక్రమణకు ప్రయత్నించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు టేకుమూడి ఈశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు సోమవారం తవ్వేసిన మంచి నీటి చెరువు ప్రాంతాన్ని పరిపాలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు అందించే చెరువు గట్టు ఆక్రమించి తవ్వకాలు చేపట్టిన ప్రోక్లైనర్‌ను సీజ్ చేసి కారకులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సూరిబాబుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వల్లు రాజబాబు, నాయకులు చిట్టూరి చలపతి, జి. ఈశ్వరరావు, బొంతు మోహన్, జక్కల ప్రసాదబాబు, వాకపల్లి చిరంజీవి, విత్తనాల పండు, వైసిపి మండల అధ్యక్షుడు కాద గోవింద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్స్‌కు బకాయి జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - కాకినాడ



అదనపు కమిషనర్‌కు వివరిస్తున్న సిఐటియు నాయకుడు వీరబాబు

కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలో తడి, పొడి చెత్తను సేకరించే క్లాప్ వాహన డ్రైవర్స్‌కి 3 నెలల బకాయి జీతాలు చెల్లించాలని సిఐటియు నాయకులు కోరారు. సోమవారం నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ సుధాకర్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ పెట్రోల్, గ్యాస్ డీలర్స్‌కు బిల్లులు చెల్లించి వాహనాలు నడిపిస్తున్న కాంట్రాక్టర్స్ డ్రైవర్స్ జీతాల చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. 2024 జనవరి నుంచి పిఎఫ్, ఇఎస్ఐ కార్మికుల జీతాల నుంచి మినహాయించినా సంబంధిత శాఖలకు నేటికీ జమ చేయలేదన్నారు. కాంట్రాక్టు సంస్థతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని అదనపు కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు షేక్ ఇస్మాయిల్, బి.శివశ్రీను, లక్ష్మణకుమార్, భద్ర, కె.శివ పాల్గొన్నారు.

ఆర్ఒ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి



ఆర్ఒ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ అమ్మాజీ

మండలంలోని రమణక్కపేటలో ఆరో ఇన్ఫ్రా - కాకినాడ సెజ్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో గంటకు 1000 లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఆర్ఒ వాటర్ ప్లాంట్‌ను సర్పంచ్ కాదులూరి అమ్మాజీ, జనసేన నాయకులు ఆలమూరు బాబీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సముద్ర తీరానికి దగ్గరలో ఉండడంతో భూగర్భ జలాల్లో ఉప్పు శాతం ఎక్కువగా ఉండి తాగేందుకు పనికిరాకపోవడంతో గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రజల ఇబ్బందిని కాకినాడ సెజ్ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించి గ్రామంలో ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేశారని అన్నారు. ఈ ప్లాంట్ ద్వారా గ్రామంలో ప్రజలకు, 3 పాఠశాలలు, 4 అంగన్‌వాడీ కేంద్రాలకు రోజు తాగునీటి ఇబ్బందులు తీరనున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆలమూరి వెంకటలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు చెల్లూరి రాము, మురాలశెట్టి సత్తిబాబు, అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు, సెజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాటన్ వస్త్రాల తయారీలోకి మారాలి

ప్రజాశక్తి - పెద్దాపురం



మహాజనసభలో నివేదికను చదువుతున్న మేనేజర్ రాజు

చేనేతకారులు కాటన్ వస్త్రాల తయారీలోకి మారాలని చేనేత జౌళి శాఖ అభివృద్ధి అధికారి, పర్సన్ ఇన్‌ఛార్జ్ ఎస్‌వి.ఫణిబాబు అన్నారు. సోమవారం స్థానిక గాంధీ చేనేత సహకార సంఘంలో జరిగిన మహాజన సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కో ద్వారా చేనేత సొసైటీలు తయారుచేసిన సిల్క్ వస్త్రాల కొనుగోలును నిలిపివేసిందన్నారు. కావున కాటన్ వస్త్రాల తయారీకి చేనేత కార్మికులు మార్పు చెందాలన్నారు. సొసైటీ మేనేజర్ దొరరాజు 2024-25 సంవత్సర నివేదికను సభలో ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మహాజన సభలో సొసైటీ మాజీ అధ్యక్షులు తూతిక సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ కట్టా రాజబాబు, చేనేత కార్మికులు ఆశపు వీరభద్రరావు, చీపూరి సూర్యనారాయణ, అల్లాడ నాగేశ్వరరావు, దోర వెంకటరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - తాళ్లరేవు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి

మండల పరిషత్‌కు చెందిన రూ.15 లక్షలతో మండలంలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఎంపిపి రాయుడు సునీత సోమవారం భూమి పూజ చేశారు. స్థానిక పంచాయితీలోని రచ్చవారిపేట, కేశవపురం, గాడిమొగ పంచాయితీ పరిధిలో సిసి రోడ్లకు, పి. మల్లవరం పంచాయతీలో డ్రెయినేజీ, పత్తిగొందిలో సిసి రోడ్డు పనులకు ఆమె భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్‌సాగర్, వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఎంపిటిసి రచ్చ ముత్యాలు, సర్పంచులు రెడ్డి అరుణ సుహాసిని దేవి, పంపన రామకృష్ణ, కామాడి గోవలక్ష్మి, ఉప సర్పంచ్ లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని రాజుపాలెం నుంచి రామవరం వెళ్లే ప్రధాన రోడ్డు పనులను త్వరతగతిన పూర్తి చేయించాలని జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ సూచించారు. సోమవారం ఆయన సంబంధిత రోడ్డు పనులను కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు రోడ్డు నిర్మాణం వేగంగా జరకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. తక్షణమే రోడ్డు నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోట రవి, జడ్‌పిటిసి తోట గాంధీ, సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్, మాజీ సర్పంచ్ అనుకుల శ్రీకాంత్, కాయల మణికంఠ, ఆర్ అండ్ బి అధికారులు, పాల్గొన్నారు.

మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎండియుడబ్ల్యూ) నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు జడ్‌పి మాజీ ఛైర్మన్ దున్నా జనార్ధనరావు, ఒఎన్‌జిసి విశ్రాంత డిప్యూటీ జిఎం రెడ్డి గిరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా కర్నీడి వెంకటరమణ, కుసుమ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కమిడి ఈశ్వరీబాయి, రొక్కం లోవరాజు, సహాయ కార్యదర్శిగా నేమాల నాగార్జున, కోశాధికారిగా విప్పర్తి శ్రీనివాసరావు ఎన్నికయ్యారని తెలిపారు.

హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయ హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్రకుమార్ సమక్షంలో హుండీలను తెరిచి 97 రోజులకు సంబంధించిన ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ హుండీల ద్వారా రూ.4,61,845 ఆదాయం, 129 రోజులకు సంబంధించిన అన్నదాన హుండీలో రూ.43,069 ఆదాయం సమకూరిందదని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, బ్యాంకు సిబ్బంది, ఆలయ పూజారి ఐవి.ప్రసాద్‌శర్మ, ఆసాధులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు

ఆస్తిపన్నుపై పెనాల్టీ విధానం తగదు

ప్రజాశక్తి - కాకినాడ

ఆస్తిపన్నుపై మొదటి 6 నెలలు పెనాల్టీ విధించడం తగదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు మొదటి అర్ధ సంవత్సరం కాగా జరగబోయే ఆరు నెలల కాలానికి ముందుగా నోటీసు ఇచ్చి మే నెల నుంచి నూటికి రెండు రూపాయల అపరాధ రుసుము విధించడం సమంజసం కాదన్నారు. రెండవ అర్ధ సంవత్సరం అక్టోబర్ నుంచి మార్చి వరకు చెల్లించే పన్నుపై నవంబర్ నుంచి వడ్డీ విధించడం సబబుగా లేదన్నారు. జరగని కాలానికి ముందస్తుగా చెల్లించే పన్నులకు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎసిబి వలలో ఎస్ఐ గుణశేఖర్

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం రూరల్ ఎస్ఐ గుణశేఖర్ రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కారు. ఓ కేసు విషయమై పి.దొంతమూరు గ్రామానికి చెందిన కె.దుర్గాప్రసాద్, ఎస్.గంగరాజు నుంచి లంచం తీసుకుంటుండగా ఎస్ఐ ఎల్. గుణశేఖర్, ఆయన వ్యక్తిగత డ్రైవర్ శివను ఎసిబి అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. ఈ ఘటనపై కాకినాడ అడిషనల్ ఎస్‌పి మనీష్ దేవరాజ్‌పాటిల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆరా తీస్తున్నారు.

ప్రయివేటు మైనింగ్ సిబ్బందిపై ఆగ్రహం

ప్రజాశక్తి - కోటనందూరు

ప్రయివేటు మైనింగ్ సిబ్బందిపై ఎంపిపి లగుడు శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య, బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిటిసి రమణమ్మ, సర్పంచ్ బొత్స సత్తిబాబు మాట్లాడుతూ తమ గ్రామాల్లో రైతులు పంట భూములను ఎత్తు, పల్లాలను ట్రాక్టర్లతో సదును చేసుకొంటుంటే ప్రయివేటు మైనింగ్ సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారని సమావేశం దృష్టికి తెచ్చారు. ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఎ.శివాజీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అనంతరం.2025-26 ఏడాది బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ పి.వెంకటనారాయణ, ప్రజా ప్రతినిధులు జగటాల వీరబాబు, గొర్ల రామచంద్రరావు, కొత్తపెల్లి మాణిక్యాలరావు, అనుకూల రిసార్ట్స్ సామ్యూల్ వేముల రాజబాబు, ఎస్. రాజు పాల్గొన్నారు.

పన్నులను వసూలు చేయాలి

ప్రజాశక్తి - కిర్లంపూడి

గ్రామాల్లో ఇంటి పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని డిఎల్‌పిఒ బాలామణి ఆదేశించారు. సోమవారం మండలంలోని వేలంక గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ పర్యటనలో పంచాయతీ కార్యదర్శి పెద్దకాపు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపిడిఒ శివరామకృష్ణ ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధి పనులు, మంచినీటి సరఫరా, పి-4 సర్వే వంటి కార్యక్రమాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

మహారాజశ్రీ సీనియరు సివిల్ జడ్జి వారి కోర్టు, రాజోలు

ఒ.యస్ నెం. 85/2014

మధ్య:
శ్రీమతి పాండ శాంత (డైడ్) అండ్ అదర్స్ -వాది
మరియు
శ్రీమతి మహంతి సత్యవతి (డైడ్) అండ్ అదర్స్ -ప్రతివాదులు

రెస్పాండెంట్ నెం-13:
మహంతి శ్రీనివాసు, తండ్రి: నారాయణ, హిందూ, వయస్సు 42 సం॥లు, వ్యాపారం, హౌస్ నెంబర్ 30-136, 7-7/1, సుధా నగర్ ఓల్డ్ సైఫయగూడ, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఇలాకా.

దావా సమను

పై నెంబరు పిటీషన్ నందు శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపిననూ ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీకు నోటీసు అమలు నిమిత్తము శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా **దివి. 04-04-2025 తేదీకి మీ హాజరు నిమిత్తము వాయిదా వేసినారు.** సదరు వాయిదాకు మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టులో పై తేదీన **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు కోర్టు వారికి తెలుపవలెను. లేని యెడల మీ పరోక్షమున దావా విచారించబడును.

అడబాల త్రినాధ ప్రభాకరరావు
అడ్వకేటు, కొత్తపేట
తేది:24-3-25 సెల్:9494429922

CHANGE OF NAME

I, KARNID VENKATESULU, S/o. Surya chandra Rao, D.No. 2-203, Pedapativari Street, George Peta (V), and Gramapanchayati, Tallarevu Mandalam, Kakinada Dist., A.P.

In my **Passport No: NO 642313** issued by R.P.O. Visakhapatnam / Hyderabad. The name of my sur name was wrongly noted as **KARNEEDI** instead of **KARNIDI** with regard to the correction. Hence my surname's correct name **KARNIDI** for all purpose.

పాస్‌పోర్టు పోయినది

తూర్పుగోదావరి జిల్లా, దేవరపల్లి మండలం, యాదవోలు గ్రామంలో డోర్ నెం. 6-126, సాధనాల శివప్రసాద్, S/o. సత్యనారాయణ అను నా యొక్క పాస్‌పోర్టు నెం. **T 8542623,** ది. 11-01-2025వ తేదీన యాదవోలు నుండి తణుకు వెళ్ళుచుండగా దేవరపల్లి మండలం, యర్నగూడెం గ్రామంలో నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. ఎవరికైనా దొరికినచో నా ఫోన్ నెంబరుకు లేదా మా అడ్రసుకు తెలియజేయగలరు.

సాధనాల శివప్రసాద్
S/o. సత్యనారాయణ
సెల్: 8008117230

IN THE COURT THE HON'BLE I ADDITIONAL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR
CRL.M.P.NO.1427 OF 2024 IN CRL.R.P.SR.NO.2739 OF 2024

BETWEEN:
M/s.EENADU TELEVISION (P) LTD., ... **PETITIONER**
AND
M/s.SRI MARUTHI DIGITAL NETWORK And others ... **RESPONDENTS**

R-1 M/s.SRI MARUTHI DIGITAL NETWORK, H.No.2-143, Simhadrinagar, Valasapakala, Kakinada (Rural), East Godavari District-533 005.

R-2 D.SRINIVAS RAO, Authorized Signatory of M/s.SRI MARUTHI DIGITAL NETWORK, H.No.2-143, Simhadrinagar, Valasapakala, Kakinada (Rural), East Godavari District-533 005.

NOTICE

The Petitioner had filed the above Criminal Petition seeking to condone the delay of (16) days in filing the above Revision Petition within the time against the Respondents which includes you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above criminal petition and the matter is posted to 09.04.2025 at 10.30 a.m. Therefore, you may appear before the Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law.

(BY ORDER OF THE COURT)
T NARASIMHA RAO
Advocate
Flat no 106, plot no 72
Road no 3, sreenivasapuram
Vanasthali puram
Hyderabad -70
Cell No: 8341658416
Consel for petitioner

గ్రామపంచాయతీ కార్యాలయం, అర్తమూరు

టెండరు నోటీసు

రి.క. నెం.13/2025 — తేది.24-03-2025

తూర్పుగోదావరి జిల్లా, మండపేట మండలంలోని అర్తమూరు గ్రామపంచాయతీకి 2025-26 సం॥నకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా సామాన్లు సప్లై చేయుటకు గాను టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లు ది. 29-3-2025 సం॥రం తేదీ శనివారం మధ్యాహ్నం గం॥ 12.00 ల వరకు అర్తమూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతిని మరియొకరిచే గాని టెండర్లు తీసుకొనబడి సదరు సీల్డు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం॥ 3.00 లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షములో తెరవబడును. టెండరు ప్రక్రియకు సంబంధించి ఇతర విషయములు కొరకు గ్రామ పంచాయతీ కార్యాలయం పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును. ధరావత్తు చెల్లించని టెండర్లు స్వీకరింపబడవు.

షెడ్యూలు

వ.నెం.	సప్లయి అయిటముల వివరము	టెండరు ధరావత్తు
1	2025-2026 సంవత్సరమునకు గాను అర్తమూరు గ్రామపంచాయతీకి కావలసిన ముగ్గు, బ్లీచింగ్, మొ॥ ప్రజారోగ్య సామాన్లు సప్లయి చేయుటకు	రూ. 200/-
2	2025-2026 సంవత్సరమునకు గాను అర్తమూరు గ్రామపంచాయతీకి కావలసిన చేతిపైపులు మరియు కుళాయి విడిభాగములు సప్లయి చేయుటకు	రూ. 200/-
3	2025-2026 సంవత్సరమునకు గాను అర్తమూరు గ్రామపంచాయతీకి కావలసిన వీధి దీపముల విడిభాగములు మరియు క్రొత్త ఎల్ఇడి లైట్లు సప్లయి చేయుట	రూ. 200/-
4	2025-2026 సంవత్సరమునకు గాను అర్తమూరు గ్రామపంచాయతీకి కావలసిన స్టేషనరీ సామాన్లు సప్లయి చేయుటకు	రూ. 100/-
5	2025-2026 సంవత్సరమునకు గాను అర్తమూరు గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి కావలసిన పండుగ బట్టలు, సబ్బులు, నూనె మరియు ఇతర సేఫ్టీకిట్స్ సప్లయి చేయుట	రూ. 100/-

సం/- **శ్రీమతి గొలుగూరి అన్నపూర్ణ**, సర్పంచ్, గ్రామపంచాయితీ, అర్తమూరు
సం/- **యస్.అనిల్‌కుమార్,** పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ. అర్తమూరు, మండపేట మండలం

గ్రామపంచాయతీ కార్యాలయం, జగన్నాధపురం
గోపాలపురం మండలం, తూర్పుగోదావరి జిల్లా

టెండరు ప్రకటన

రి.క. నెం. /2025 — తేది.12-03-2025

తూర్పుగోదావరి జిల్లా, గోపాలపురం మండలం, జగన్నాధపురం గ్రామపంచాయతీ నందు 2025-2026 సంవత్సరమునకు అనగా ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు ఈ దిగువ ఉదహరించిన పనులు చేయుటకు టెండర్లు పిలుచుటకు ది. 17-03-2025 వరకు టెండర్లు స్వీకరించబడి, అదేరోజు ఉదయం 10.30 ని॥లకు టెండర్లు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని, లేక అధికారం ఇవ్వబడిన వారిచే గాని టెండర్లు తెరవబడును. టెండర్లు దాఖలు చేయువారు షెడ్యూల్ నందు చూపబడిన టెండర్లు డిపాజిట్లు చెల్లించి రశీదు జతపరచవలెను. ఇతర వివరములు కార్యాలయం పని వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

వ.నెం.	వివరములు	చెల్లించవలసిన ధరావత్తు
1	ప్రజారోగ్య పారిశుద్ధ్య నిర్వహణ - 3	రూ. 100/- (1కి)
2	రక్షిత మంచినీటి పథకములు నిర్వహణ - 1	రూ. 100/- (1కి)
3	వీధి దీపములు రిపేరు చేయుటకు - 1	రూ. 100/- (1కి)
4	బుక్స్ & స్టేషనరీ సామానులు సరఫరా - 1	రూ. 200/-
5	విద్యుత్ విడి పరికరములు కలెక్టర్ అప్రూవల్ ఆథరైజ్డ్ డీలర్లు మాత్రమే	రూ. 200/-
6	పి.హెచ్. సామానులు సప్లయి - 1	రూ. 200/-

పై అయిటములు కాలపరిమితి 2025-2026 అనగా 01-04-2025 నుండి 31-03-2026 వరకు

సం/- **ఈర్పిన రామ సత్యవతి,** సర్పంచ్, గ్రామపంచాయతీ, జగన్నాధపురం, గోపాలపురం, తూర్పుగోదావరి జిల్లా
సం/- **తానేటి నవీన,** పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ, జగన్నాధపురం, గోపాలపురం, తూర్పుగోదావరి జిల్లా

గ్రామపంచాయతీ కార్యాలయము, ఎ.అన్నవరం

ఆర్.సి. నెం.2/2025 — ది.22-03-2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్
టెండరు నోటీసు

ఇందుమూలంగా శంఖవరం మండలం, ఎ.అన్నవరం గ్రామపంచాయతీ, ది. 29-03-2025 సంవత్సరం మధ్యాహ్నం గం॥ 2.00 లకు సమయం నందు శంఖవరం మండలం, ఎ.అన్నవరం గ్రామపంచాయతీకి చెందిన ఈ దిగువ ఐటంకు సీల్డు టెండర్లు తీసుకొనబడును. అదేరోజు సాయంత్రం గం॥ 4.00 లకు టెండరు దారుల సమక్షంలో తెరచి ఎక్కువ రేట్లకు ఐటం నెం.1 కు గాను ఎక్కువ రేటు లకు వేసిన టెండర్‌ను అదేవిధంగా నిబంధనలకు గ్రామపంచాయతీ తీర్మానం, శ్రీ జిల్లా పంచాయతీ అధికారి వారి ఆమోదం మేరకు అప్పగించబడును. ఇందు పై సదరు ఐటం కి ది. 14-02-2025న సీల్డ్ టెండర్స్ తీసుకొనగా సంవత్సరం ఒక్కింటికి రూ. 1,90,000/- చొప్పున సీల్డ్ టెండర్ ఒకరు వేయగా, వేరొక్కరు ది. 15-03-2025 న గ్రామపంచాయతీ తీర్మానం సమయంలో ఒక వ్యక్తి దరఖాస్తును 2,10,000/-లకు హెచ్చుకు ఇవ్వవలసిందిగా ఇచ్చుచు వారి దరఖాస్తులో ప్రతి ఐదు సంవత్సరాలకి ఒకసారి 10% చొప్పున అద్దెని కూడా పెంచుటకు గడువు 15 సంవత్సరములు అనంతరం వారిచే ఏర్పాటు చేసిన ప్రతి వస్తువులు పంచాయతీ వారికే విడిచి (జనరేటర్‌తో సహా), 3 షాపులు వారికే కేటాయింపు చేయుటకు వాటికి అద్దెలు చెల్లించుటకు దరఖాస్తులో చేసియున్నారు.

ఇందుపై షరతులు మరియు గ్రామపంచాయతీ నందు గల ఇతర షరతులు ప్రకారంగా సీల్డ్ టెండర్స్ తీసుకొనబడును. ఇతర వివరములు గ్రామపంచాయతీ పనిచేయు వేళలలో తెలుసుకొనవచ్చును.

వ. నెం.	ఐటం వివరం	కాలపరిమితి	డిపాజిట్ మొత్తం మరియు దరఖాస్తు రుసుము
1.	పాత బస్టాండ్ వద్ద గల షాపింగ్ కాంప్లెక్స్‌ప 1, 2 అంతస్తులకు	15 సంవత్సరాలు	5,000 500 రూ. 5,500/-

సం/- **శెట్టిబత్తుల కుమార్‌రాజా,** సర్పంచ్, గ్రామపంచాయతీ, ఎ.అన్నవరం
సం/- **వాడ్రేవు చక్రవర్తి,** పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ, ఎ.అన్నవరం

గ్రామపంచాయతీ కార్యాలయము, ఎ.అన్నవరం

ఆర్.సి. నెం.2/2025 — ది.22-03-2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్
టెండరు నోటీసు

ఇందుమూలంగా శంఖవరం మండలంలో ఉన్న ఎ.అన్నవరం గ్రామపంచాయతీలో ది. 29-03-2025వ తేదీన మధ్యాహ్నం 2.00 లకు సమయం నందు శంఖవరం మండలం, ఎ.అన్నవరం గ్రామపంచాయతీకి చెందిన ఈ దిగువ ఐటంకు సీల్డు టెండర్లు తీసుకొనబడును. అదేరోజు సాయంత్రం గం॥ 4.00 లకు టెండరుదారుల సమక్షంలో తెరచి ఎక్కువ రేట్లకు వేసిన టెండర్‌ను ఆమోదించి పంచాయతీ కార్యదర్శి వారిచే గాని, లేక వారి అధికారం ఇవ్వబడిన మరియొకరిచే గాని టెండర్లు తెరవబడును. టెండర్ దాఖలు చేయువారు షెడ్యూల్ నందు చూపబడిన టెండర్లు డిపాజిట్లు చెల్లించి రశీదు జతపరచవలెను. ఇతర వివరములు కార్యాలయ పనివేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	వివరం	డిపాజిట్	కాలం	దరఖాస్తు రుసుము
1	విద్యుత్ విడిభాగములు అనగా విడిభాగములు, ఎలక్ట్రికల్ సామాగ్రి సప్లయి చేయుటకు	రూ. 1000/-	2025-26 01-04-2025 టు 31-03-2026	రూ.500/-
2	గ్రామపంచాయతికి ప్రజారోగ్య ముగ్గు, బ్లీచింగ్, ఫినాయల్ వగైరా సప్లయి చేయుటకు	రూ. 1000/-	01-04-2025 టు 31-03-2026	రూ.500/-
3	స్టేషనరీ సామాగ్రి సప్లయి చేయుటకు	రూ. 500/-	01-04-2025 టు 31-03-2026	రూ.200/-
4	వాటర్ సప్లై సామగ్రి	రూ. 1000/-	01-04-2025 టు 31-03-2026	రూ.200/-
5	ఈ పంచాయతీకి అవసరమైన పారిశుద్ధ్య వాటర్ సప్లై సేవలు	రూ. 200/-	01-04-2025 టు 31-03-2026	రూ.100/-

పేమెంట్ ఈ పంచాయతీ కార్యదర్శి వారి ఆర్డర్ అనుసరించి ఆరోగ్యమైన మార్క్ గలవి సప్లై చేయగలరు. పేమెంట్స్, ఖర్చులు నిధుల లభ్యతను బట్టి చేయబడును.

సం/- **శెట్టిబత్తుల కుమార్‌రాజా,** సర్పంచ్, గ్రామపంచాయతీ, ఎ.అన్నవరం
సం/- **వాడ్రేవు చక్రవర్తి,** పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ, ఎ.అన్నవరం